క్లుప్తంగా

వృత్తివిద్యా కోర్సులే భవిష్యత్‌కు సోపానాలు



ముప్పాళ్ళ: వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్‌కు ఉపాధి సోపానాలు అని ముప్పాళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శుక్రవారం లెర్నెట్ స్కిల్స్ వారి ఆధ్వర్యంలో దూళిపాళ్ళలోని రాయని స్పింటెక్స్ మిల్లును సందర్శించారు. మిల్లులో దారం తయారీ, సెన్సార్ బేస్డ్ మిషన్స్, సోలార్ ప్యానల్స్ ఉపయోగం, ఎలక్ట్రిసిటీ జనరేషన్ గురించి నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వృత్తి విద్యా ఉపాధ్యాయిని జి.దయామణి తెలిపారు. వారితో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయినులు శిరీష, రజని పాల్గొన్నారు.

1350 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



క్రోసూరు: మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాల డ్రైవ్ కార్యక్రమంలో శుక్రవారం 1350 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క పశుపోషకులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు. ప్రతి గ్రామంలో రెండు రోజుల పాటు క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు రైతుభరోసా కేంద్రాల వద్దగాని, గోపాలమిత్రులను అడిగి సమాచారం తెలుసు కోవచ్చునన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో 'బంగారు తల్లి'



పెదకూరపాడు: మండలంలోని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం బంగారు తల్లి కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మీ, సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ గుంటూరు రవివర్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ ఆడబిడ్డలను కాపాడుకునేందుకు , మహిళ వివక్ష నిర్మూలనకు బంగారు తల్లి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేలు గొండారెడ్డి, డాక్టర్ అదిత్య ,స్టాఫ్‌నర్సులు విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



పెదకూరపాడు: విద్యాతోనే అభివృద్ధి సాధ్యమని ప్రముఖ ఆడిటర్ గడ్డిపాటి సుధాకర్ అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు రాయపూడి సేల్ఫ్ ఫౌండేషన్ (యూఎస్ఐ), జనచైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి 78 మందికి విద్యాజ్యోతి స్టడీమెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గతంలో అన్ని వసతులు ఉన్న పాఠశాలలు లేవన్నారు. నేడు ప్రభుత్వం, దాతలు సహయంతో పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రమ శిక్షణ, పట్టుదల అలవర్చుకోవాలన్నారు. దాతల సహాయంతో అందించే స్టడీ మెటీరియల్‌ను శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణ, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ బెన్నిబాబు, రాయపూడి పౌండేషన్ నిర్వాహకులు రాయపూడి సాంబశివరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవికిరణ్ శుక్రవారం తెలిపారు. 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నామ న్నారు.

కళలను కాపాడేందుకే ముగ్గుల పోటీలు

- విజేతలతో పాటు భాగస్వాములైన ప్రతి మహిళకు బహుమతి
- గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రతి గ్రామంలో విశేష స్పందన
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కంకణాలపల్లిలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు పరిశీలన



కంకణాలపల్లిలో ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అంతరించిపోతున్న కళలను కాపాడేందుకు మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల పరిధిలోని కంకణాలపల్లి గ్రామంలో శుక్రవారం వైఎస్ఆర్ సంక్రాంతి గ్రామీణ ముగ్గులపోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఎన్నో వ్యయ ప్రయాసలు అవుతున్నప్పటికీ భావితరాలకు సంక్రాంతి సంబరాల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

నియోజకవర్గంలో ముగ్గుల పోటీలకు ఈ ఏడాది 10 వేల మంది పాల్గొంటారని భావిస్తే ఆ సంఖ్య 12,000 దాటే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ముగ్గుల పోటీల్లోని విజేతలకు నగదు బహుమతులు అందించడంతో పాటు పోటీల్లో భాగస్వాములైన ప్రతి మహిళకు ఏటా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. మహిళలు తమలో దాగివున్న నైపుణ్యాలను ప్రదర్శించి సాంప్రదాయాలు కొనసాగించేందుకు ముగ్గుల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కంకణాల పల్లి గ్రామంలో అత్యధికంగా 287 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో భాగస్వాములయ్యారన్నారు. ఈ పోటీల్లోని విజేతలకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి మండలస్థాయి విజేతలతో ఈ నెల 12న సత్తెనపల్లిలో నియోజకవర్గ స్థాయిలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖా మంత్రి, నగరి శాసనసభ్యురాలు ఆర్కే రోజా హాజరవుతారన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళ నియోజకవర్గ స్థాయి పోటీలకు హాజరై సంక్రాంతి సంబరాల్లో పాల్గొని తమ ఆతిథ్యం స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొడుగుల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ వన్నూరు చెరుకూరు, సుబ్బయ్య రవిచంద్రన్, షణ్ముఖ దాసు, స్థానిక నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో....



నకరికల్లులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

నకరికల్లు: పండుగ వాతావరణంలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రమంత్రి అంబటి రాంబాబు సూచనల మేరకు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పోటీల్లో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. కళాత్మకత ఉట్టిపడేలా మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. న్యాయనిర్ణేతలు ముగ్గులను క్షుణ్ణంగా పరిశీలించి ఐదుగురు విజేతలను ఎంపిక చేశారు. మొదటిస్థానంలో సూరేపల్లి అనూష, రెండోస్థానంలో చిమటా గురవమ్మ, మూడోస్థానంలో నిడికొండ లక్ష్మీ కోటేశ్వరి, నాలుగోస్థానంలో పగడాల గాయత్రి, ఐదోస్థానంలో పూసా అంకిత విజేతలుగా నిలిచారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్ బీబాషా, పీఎంసీ చైర్మన్ ముప్పాళ్ల మస్తాన్‌వలి, శాగం చంద్ర శేఖర్‌రెడ్డి, సలీల్, పరసా సాంబయ్య, ప్రధానోపాధ్యాయుడు నగేష్, వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు కె.అమలకుమారి
- ప్రకృతి వ్యవసాయ కార్యచరణ ప్రణాళిక 2025



మాట్లాడుతున్న డీపీఎం కె.అరుణకుమారి

క్రోసూరు: వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని క్రోసూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక 2025 గురించి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు కె. అమలకుమారి అధ్యక్షతన శుక్రవారం రూపొందించిండం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అమల కుమారి మాట్లాడుతూ క్రోసురు సబ్ డివిజన్ లోని రాజుపాలెం, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రకృతి వ్యవ సాయ విధానాలను రైతుల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు క్రోసుర్ డివిజన్‌లో 7458 మంది రైతులు 8917.31 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. అదే విధంగా, నిరంతరం ఆదాయాన్నిచ్చే ప్రకృతి వ్యవసాయ మోడల్స్ ఏటీఎం, ఏగ్రేడ్ డీఆర్‌పీఎం మోడల్స్ సాగుచేసి మంచి ఆదాయం పొందుతున్నారన్నారు. వచ్చే 2025 మార్చి వరకు లక్ష్యంగా 7555 రైతులతో 17007.69 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రసాయన పురుగుమందులతో వ్యవసాయం చేస్తున్న రైతులు, మహిళ సంఘాల సభ్యులు, కౌలు రైతులు, ప్రభుత్వ వ్యవసాయ అధికారుల సలహా సూచనలతో 2025 ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లా అదనపు డీపీఎం ప్రేమరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘాల్లో కూడా మహి శా సంఘాల ద్వారా పకృతి వ్యవసాయాన్ని మరింత బలపరచాలన్నారు అదేవిధంగా ప్రతి మహిళ కూడా వారి ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కిచెన్ గార్డెన్స్-ఏటీఎం మోడల్స్ వేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతు గోవీంద రెడ్డి, మండల సమాఖ్యఅధ్యక్షురాలు అనంత లక్ష్మీ, ఎంటిల్ పవన్ కుమార్,ఎస్ఎస్ నంద కుమార్, అప్పలరాజు, సౌజన్య, సైదయ్య, డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్నెపాడులో గ్రామోదయం



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పాల్గొని గ్రామంలోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. క్లాప్‌మిత్రలతో కలిసి అల్పాహారం చేశారు. గ్రామంలో చెత్త సేకరణ తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పారిశుద్ధ్య చర్యలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎనీమియా కలిగిన బాలికల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

- మండల ప్రత్యేక అధికారి సుధాకర్
- ఫణిదంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం



నందిగామలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



బృగుబండలో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

సత్తెనపల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల్లో భాగంగా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో శుక్రవారం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా పోటీ తత్వంతో క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఫణిదంతో పాటు మండలంలోని కొమెరపూడి, నందిగామ, బృగుబండ గ్రామాల్లో కబడ్డీ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ.సత్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు, పీడీలు, నోడల్ అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

• రంగవల్లికలు.. ఆనందడోలికలు



సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని నిర్వహించిన వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పట్టణంలో శుక్రవారం 9 వార్డుల్లో ముగ్గుల పోటీలు వార్డు స్థాయిలో నిర్వహించగా 1,256 మంది మహిళలు వివిధ రంగులతో కూడిన రంగవల్లులు తీర్చిదిద్దారు. పట్టణంలోని 3వ వార్డులో 392 మంది, 11,12 వార్డుల్లో 190 మంది, 19,20 వార్డుల్లో 278 మంది, 21,22 వార్డుల్లో 231 మంది, 25,26 వార్డుల్లో 165 మంది మహిళలు ముగ్గులు వేశారు. ఆయా వార్డుల్లో సిమెంట్ రోడ్లన్నీ రంగవల్లులతో నిండిపోయాయి. – సత్తెనపల్లి

మంచి జరిగితే మనసారా ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కర్లపూడిలో పింఛన్ పంపిణీ



వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: రాష్ట్రంలోని అన్నివర్గాల అభ్యున్నతి కోసం జగనన్న పాలనలో మంచి జరిగిందని భావిస్తే మరొక్కసారి మనసారా ఆశీర్వదించాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు కోరారు. శుక్రవారం మండలపరిధిలోని కర్లపూడి గ్రామంలో రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో స్వయంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. పెన్షన్ల పంపిణీ ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో జరుగుతోందన్నారు. అవ్వతాతలు పెన్షన్ పెంపుతో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కర్లపూడి గ్రామంలో 2019 వరకు కేవలం 299 మందికి రూ.3 లక్షల పెన్షన్ ఇచ్చేవారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులందరికీ పెన్షన్ అందే ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం 412 మందికి రూ.12.36 లక్షలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కర్లపూడిలో కనీసం రోడ్డు కూడా వేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ, బీసీ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. నాలుగున్నరేళ్లలో మంచి జరిగిందని భావిస్తే.. తమకు ఓటు మరోసారి వేసి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, ఎంపీటీసీ బండ్లమూడి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంచికలపూడి వీరరాఘవయ్య, చిలకా సాంబయ్య పాల్గొన్నారు.

నకరికల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష

వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భవనం రాఘవరెడ్డి



మందులు పంపిణీ చేస్తున్న భవనం రాఘవరెడ్డి



ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న కాంతారావు, పుట్టారెడ్డి

నకరికల్లు: పేదల ఇంటివద్దకే వచ్చి వైద్యం అందించే గొప్ప కార్యక్రమం అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తశాతం, బీపీ, షుగరు, ఈసీజీ లాంటి పరీక్షలతో పాటు డెంగీలాంటి ఖరీదైన పరీక్షలు కూడా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్‌లు అందుబాటులో ఉండి వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం మరే ప్రభుత్వంలోను సాధ్యపడలేదన్నారు. ప్రజలు రెండోవిడత క్యాంపులను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బి.మణికంఠ, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ శ్రావణి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే ఆరోగ్య సురక్ష

మాదల (ముప్పాళ్ళ): అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా గ్రామాల్లో నిపుణులైన వైద్యులతో ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ కాంతారావు చెప్పారు. మండలంలోని మాదల గ్రామ సచివాలయం-2 పరిధిలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన కాంతారావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించటమే శిబిరాల నిర్వహణ ఉద్దేశమన్నారు. శిబిరంలో మొత్తం 223 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కంటి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను అందించారు. శిబిరంలో వైద్యులు బి.నారాయణ, సౌమ్య, వి.జయకృష్ణ ప్రవీణ్, మధు, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పీ.పుట్టారెడ్డి, సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, గ్రామ ఉపసర్పంచ్ చిమటా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, కానాల పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌లు పీటర్‌డానియేన్, జోస్పిన్‌రాణి, పంచాయతీకార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108 మందికి నూతన పెన్షన్లు మంజూరు

అచ్చంపేట: మండలంలో నూతనంగా 108 మందికి నూతన పెన్షన్లు మంజూరైనట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కె.వీర్రాజు తెలిపారు. వీరందరికీ నెలకు రూ.3000 ఇవ్వనున్నట్లు చెప్పారు. వీరిలో వృద్ధాప్య పెన్షన్లు 44, వికలాంగుల పెన్షన్లు 25, ఒంటరి మహిళ పెన్షన్లు 2 మంజూరైనాయన్నారు. కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 9079 పెన్షనర్లకు జనవరి నుంచి రు.3000 ఇస్తున్నట్లు చెప్పారు. జగన్ సీఎం అయిన తరువాత అంటే గత నాలుగున్నరేళ్లలో 4000లకు పెన్షన్లు మంజూరు చేశామన్నారు.

ఈవీఎం వినియోగంపై ఓటర్లకు అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నకరికల్లు: ఈవీఎంల వినియోగంపై ప్రతి ఓటరు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ అసిస్టెంట్ ఎం.రామకృష్ణ అన్నారు. ఈవీఎంల వినియోగం, పనితీరుపై ఓటర్లకు స్థానిక సచివాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారి అనుమతి ఉన్నప్పుడే ఈవీఎంలో ఓటు వేయగలుగుతామన్నారు. అధికారి అనుమతి పొందిన తరువాత ఈవీఎం పరికరంపై ఆకుపచ్చరంగు లైటు వెలుగుతుందని ఆ తరువాతే కావలసిన గుర్తుపక్కన బటన్ నొక్కాలన్నారు. ఒక్కసారి మాత్రమే ఓటు వేసే వీలుంటుందని అన్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న ఓటరు తాను వేసిన గుర్తుపై ఓటు నమోదైందో లేదో చూసుకునేందుకు వీలుగా పక్కనే అమర్చిన పరికరంపై డిస్‌ప్లే అవుతుందన్నారు. కొందరు ఓటర్ల చేత నమోదు ఈవీఎం పరికరంలో ఓటు వేయించి అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమాన్ని సెక్టార్ ఆఫీసర్ జె.శ్రీనివాసులు, కుంకలగుంట జోనల్ ఆఫీసర్ కె.రామకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వీఆర్వో గౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, కిట్లు పంపిణీ



కిట్లు, క్రీడాదుస్తులు అందజేస్తున్న రాఘవరెడ్డి

నకరికల్లు: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి క్రీడాకారులకు సూచించారు. ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి జట్టు క్రీడాకారులకు స్థానిక సచివాలయంలో శుక్రవారం క్రీడా దుస్తులు, కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సైదారెడ్డి పాల్గొన్నారు.

ఫణిదంలో ప్రత్యేక అధికారి పర్యటన

సత్తెనపల్లి: మండలంలోని ఫణిదం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఏ.సుధాకర్ శుక్రవారం పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కాఫీ విత్ క్లాప్ మిత్రలో భాగంగా ఎస్ డబ్ల్యు పీసీ సెంటర్‌లో క్లాప్ మిత్రులతో సమావేశమై వారిని సత్కరించారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. బంగారు తల్లి పథకంలో భాగంగా రక్తహీనత తక్కువ గ్రేడ్ ఉన్న తల్లి దండ్రులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహన్ సింగ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆషా, సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు, దాచేపల్లి వీరాంజనేయులు ఉన్నారు.